క్లుప్తంగా

బీఎల్‌ఆర్‌కే కాంగ్రెస్ టికెట్

మిర్యాలగూడ : మిర్యాలగూడ అసెంబ్లీ స్థానానికి బత్తుల లక్ష్మారెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా గురువారం అధిష్టానం ప్రకటించింది. అక్టోబర్ 9న ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ముందుగా బీఆర్‌ఎస్‌తో పొత్తు అనుకున్నారు. కానీ ఇరు పార్టీలకు సీట్ల విషయంలో పొత్తులు కొలిక్కి రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ మూడో జాబితాను గురువారం రాత్రి విడుదల చేసింది. అందులో భాగంగా మిర్యాలగూడ అసెంబ్లీ స్థానానికి బత్తుల లక్ష్మారెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధికారికంగా టికెట్‌ను ఖరారు చేసింది. దీంతో మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, బీఎల్‌ఆర్ అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అడవిదేవులపల్లి : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదిన ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30గంటలకు జరిగే సమావేశానికి గౌరవ సభ్యులతో పాటు అన్ని మండల శాఖ అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : విద్యుదాఘాతంతో కాడి ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని చింతలపాలెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు వస్తపురి కొండ తెలిపిన వివరాల ప్రకారం... రోజువారిగానే పశుగ్రాసం కోసం గురువారం కూడా తన ఎద్దులను తోలుకుని పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ. 70వేలు ఉంటుందని ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత రైతు కొండ కోరారు.

నలుగురిపై కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి నామినేషన్ ర్యాలీలో భాగంగా గురువారం పలువురు వ్యక్తులు రైలు పట్టాలపై ఎక్కడంతో రైలు డ్రైవర్ మూడు నిమిషాలు పాటు ఆపాల్సి వచ్చింది. ఈ ఘటనపై పలువురి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని రైల్వే పోలీసులు అక్కడ ఉన్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ జీపీకే రెడ్డి తెలిపారు.

మద్యం, డబ్బులకు ఓటును అమ్ముకోవద్దు



ఓటుపై అవగాహన కల్పిస్తున్న చొల్లేటి ప్రభాకర్

నల్లగొండ టౌన్ : మద్యం, డబ్బులకు లొంగి ఓటును అమ్ముకోవద్దని నల్లగొండ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ కోరారు. గురువారం స్థానిక బస్టాండ్ వద్ద ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : చిలుకల గోవర్ధన్ రెండో వర్ధంతి సందర్భంగా గురువారం నల్లగొండ పట్టణంలోని 20 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగిని భీమయ్య, కోడె సతీష్‌కుమార్, కేఎస్ ప్రసాద్, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, లింగయ్య, ఎల్‌వీ కుమార్, మందడి నర్సిరెడ్డి, సత్యనారాయణ, చిలుకల పాండురంగారావు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎలక్షన్ వాచ్ కమిటీ సభ్యులు

రామగిరి(నల్లగొండ): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎలక్షన్ వాచ్ కమిటీ సభ్యుడు బొమ్మరబోయిన కేశవులు అన్నారు. గురువారం తిప్పర్తిలో ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అబేదా బేగం, ఆర్‌ఐ నరహరి, ఏఎస్‌ఐ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భారీగా నామినేషన్ల దాఖలు

- ఆరో రోజు 32 నామినేషన్లు
- మిర్యాలగూడలో 16, నాగార్జునసాగర్‌లో పది, దేవరకొండలో ఏడు



మిర్యాలగూడలో నామినేషన్ వేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి జిల్లా రవి



స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేస్తున్న వర్లమూడి మహేందర్, మధు సపావత్, సయ్యద్ ఫారూఖ్

మిర్యాలగూడ : మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గానికి గురువారం 16నామినేషన్ల సెట్లు దాఖలైనట్లు ఆర్‌ఓ చెన్నయ్య తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా నల్లమోతు భాస్కర్‌రావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బత్తుల లక్ష్మారెడ్డి, బత్తుల మాధవి, సీపీఎం అభ్యర్థిగా జూలకంటి రంగారెడ్డి, డబ్బికార్ మల్లేష్‌లతోపాటు మరో 11సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.

సాగర్‌లో పదిమంది 15 సెట్లు..

నిడమనూరు : నాగార్జున సాగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి గురువారం పది మంది అభ్యర్థులు 15 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి జే శ్రీనివాస్ తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నోముల భగత్ రెండు సెట్లు, కాంగ్రెస్ అభ్యర్థిగా కుందూరు జైవీర్‌రెడ్డి నాలుగు సెట్లు, కాంగ్రెస్ అభ్యరిగానే జానారెడ్డి రెండు సెట్లు, బీజేపీ అభ్యర్థిగా కంకణాల నివేది, యుగ తులసి పార్టీ నుంచి అన్నపూర్ణ నకిరేకంటి, స్వతంత్ర అభ్యర్థులుగా బనావత్ బాలునాయక్ దేవళ్ల సుబ్బారావు, వనం విజయ్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. మామిడి సైదయ్య(డీఎస్‌పీ), అనిత మసున(అలెయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ) ఇద్దరూ గురువారం అదనపు సెట్లను దాఖలు చేశారు.

దేవరకొండలో ఏడుగురు తొమ్మిది సెట్లు..

దేవరకొండ : ఆరో రోజు ఆరుగురు అభ్యర్థులు 9 నామినేషన్లను దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారులు శ్రీరాములు తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ రెండు సెట్లు, బీజేపీ అభ్యర్థి కేతావత్ లాలునాయక్ రెండు సెట్లు, స్వతంత్ర్య అభ్యర్థి రమావత్ గోపాలకృష్ణ, గుగులోతు రవినాయక్, సోషలిస్ట్ పార్టీ(ఇండియా) అభ్యర్థి కొర్ర లక్పతి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముఢావత్ సతీరాం, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి కేతావత్ బాబురాంలు నామినేషన్లు సమర్పించారు. నేటితో నామినేషన్ల ప్రక్రియ ముగియనుండడంతో అభ్యర్థులు చివరి రోజు నామినేషన్ల దాఖలకు సిద్ధమయ్యారు.



దేవరకొండ : నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి లాలునాయక్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీతారాం, విద్యార్థి రాజకీయ పార్టీ అభ్యర్థి బాబూరామ్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి



నిడమనూరు : నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి



నిడమనూరు : నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్రులు, గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులు

సమస్యలపై నిరంతర పోరాటం



బీఎల్‌ఆర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తుంగపాడు సర్పంచ్ నాసమ్మ

మిర్యాలగూడ : రైతంగా, ఇతర ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రభుత్వం పోరాటం చేశానని మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లక్ష్మారెడ్డి భారీ ర్యాలీ నిర్వహించి ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 7గంటలకే మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామంలో స్థానిక సర్పంచ్ మచ్చ నాసమ్మ చేతులమీదుగా నామినేషన్ పత్రాలు తీసుకోని పాదయాత్రతో ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి, మాడుగులపల్లి, మిర్యాలగూడ రూరల్, అడవిదేవులపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ పట్టణం నుంచి వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా ర్యాలీకి తరలివచ్చారు. ఆర్‌ఓ కార్యాలయంలో బత్తుల లక్ష్మారెడ్డి ఒక సెట్, ఆయన సతీమణి బత్తుల మాధవి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

మర్రిగూడ : మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించతలపెట్టిన సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా వాయిదా పడింది. తిరిగి శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ సయ్యద్ యాకుబ్‌అలీ తెలిపారు. చండూరులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కాలేదు. ఎంపీపీ మోహన్‌రెడ్డి హాజరైై కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీఓ మహమ్మద్ యాసుఫ్, బీట్ ఆఫీసర్ లావణ్య, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేడియాలజిస్టులకు సన్మానం

నల్లగొండ టౌన్ : ఇంటర్నేషనల్ రేడియాలజిస్టు డే సందర్భంగా గురువారం నీలగిరి ఐఎంఏ ఆధ్వర్యంలో రేడియాలజిస్టు డాక్టర్లు పీవీఎస్ మూర్తి, అపర్ణ, ప్రశాంత్, హరిప్రసాద్, కీర్తి, హేమలతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ రోగాలను గుర్తించడంలో రేడియాలజిస్టుల పాత్ర కీలకమన్నారు. వ్యాధులను నయం చేయడంలో వారి సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, డాక్టర్లు వసంతకుమారి, సుచరిత, ఇమ్మానుయేల్, సుధాకర్, దైవాదీనం, హరినాథ్, రాజేశ్వరి, విశ్వజ్యోతి, కీర్తి, రవిప్రకాష్, హుసేన్‌రెడ్డి, రజిత, ఫణికుమార్, రితేష్, ప్రత్యూష, నితీషా పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న అభ్యర్థి రవీంద్రకుమార్

దేవరకొండ : డిండి మండల పరిధిలోని సింగరాజుపల్లి, బొగ్గులదోన, పీఏపల్లి మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారు గురువారం దేవరకొండలో ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేతావత్ బీల్యానాయక్,వడ్త్య రమేశ్‌నాయక్, నేనావత్ కిషన్‌నాయక్, సునీతాజనార్ధన్‌రావు, వంగాల ప్రతాప్‌రెడ్డి, వల్లపురెడ్డి, ముచ్చర్ల ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

రామమ్మ మృతి బాధాకరం

చింతపల్లి : మండలంలోని భట్టుగూడెం బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దుపాట మట్టం రాజు తల్లి దుపాబాటి రామమ్మ మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఆమె మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ దండేటికార్ లలితమోహన్, దండేటికార్ ప్రసాద్, ఆరెకంటి జంగయ్య, రేణుకుంట్ల వెంకటయ్య, ఆరెకంటి రాధాక్క, బిచ్చానాయక్, నిమ్మ వీరయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ : సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలతో ప్రజలను, దళిత బంధు పేరుతో దళితులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఎన్జీ కళాశాల ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా వారిని పోలీసులు అడ్డుకునే యత్నం చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ మీడియా కో–ఆర్డినేటర్ గౌతమ్ సేథ్, కాంగ్రెస్ పార్టీ నల్ల గొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మందడి శ్రీనివాసరెడ్డి, నంద్యాల వీర బ్రహ్మానందరెడ్డి, పాండు, జూలకంటి సైదిరెడ్డి, గాలి నాగరాజు, మామిడి కార్తీక్, రాకేష్, శేఖర్ రెడ్డి, పాదం అనిల్, శేఖర్, జహంగీర్ బాబా సిద్ధు, నందిని, శ్రీకాంత్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల ఎన్నిక

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీ గ్రామ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామంలోని 77వ బూత్ కమిటీ కన్వీనర్లుగా ఏదుళ్ళ అజిత్‌రెడ్డి, సాగర్ల నాగరాజు, 78వ బూత్ కమిటీ కన్వీనర్లుగా నూతి వెంకటేశం, ఏర్పుల నర్సింహ, 78వ బూత్ కమిటీ కన్వీనర్లుగా నీలకంఠం నరేష్, ఓర్సు సైదులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపు సీజ్

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఓ వైన్స్‌షాపులో అనుమతికి మించిన అధిక మద్యం ఉండడంతో వారం క్రితం తనిఖీ చేసిన నాంపల్లి ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం రాత్రి వైన్స్ షాపును సీజ్ చేశారు. ఎక్సైజ్ ఎస్‌ఐ వీరేశం తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వైన్స్‌షాపులో 150 కాటన్ల బీర్లు(1800 బీర్ సీసాలు) లెక్కకు మించి ఉండడంతో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

- ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- వాటి పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ నియోజకవర్గంలోని సమస్యాత్మక, ఇతర గ్రామాల్లో పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. ఆయా గ్రామాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. అడవిదేవులపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ, వేములపల్లి, మాడుగులపల్లి మండలాల్లోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న సీసీ కెమరాలతో పాటు అనుసందానమైన కెమెరాలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని అధికారులు నియమించారు. గ్రామాల్లో ఎలాంటి ఘర్షన వాతావరణం చోటుచేసుకోకుండా, వివిధ పార్టీల అభ్యర్థులు ఓటర్లను మభ్యపెట్టేందుకు నగదుతో పాటు పంపిణీ చేసేందుకు అవకాశం లేకుండా ఏర్పాటు చేశారు. ఒకవేళ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ దృశ్యాలు రికార్డు అయితే అభ్యర్థులకు ఇబ్బందులు తప్పవు. ఈ సీసీ కెమెరాలు పోలీసులకు అనుసంధానంగా ఉన్నాయి. దీంతో పోలీసులు, కేంద్ర బలగాల బృందాలు, పారామిలటరీ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు అడుగడునా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అలాగే స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్ (ఎస్‌ఎస్‌టీ) బృందాలు ఇప్పటికే ముమ్మరంగా తనిఖీలు చేపడుతుఆన్నయి. ఈ బృందంలో రెవెన్యూ అధికారులు కూడా ఉన్నారు. ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఇతర అంశాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షన్

చండూరు : స్వచ్ఛ సర్వేక్షన్ 2.0లో భాగంగా గురువారం చండూరు పురపాలక సంఘం పరిధిలో 'స్వచ్ఛ దీవాళీ–శుభ దీవాళీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు దియా స్టాల్ ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ కమిషనర్ డా. ఎస్. వెంకట మణికరణ్, మేనేజర్ ఆర్.అరుణకుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎమ్.అరవింద్ రెడ్డి, మహిళా సంఘం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దు

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జైవీర్‌రెడ్డి

హాలియా : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి నామినేషన్ వేసిన అనతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, సీనియర్ నాయకులు యడవెల్లి రంగసాయిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, జెడ్పీటీసీ రామేశ్వరీమట్టారెడ్డి, వైస్ ఎంపీపీ మాలే అరుణసత్యనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, ఓబీసీ అధ్యక్షుడు కుకడాల ఆంజనేయులు, నాయకులు మలిగిరెడ్డి లింగారెడ్డి, శంకర్‌నాయక్, నూకల వెంకట్‌రెడ్డి, బొల్లం శ్రీనివాస్ యాదవ్,పాదిల కృష్ణ జూపల్లి శ్రీనివాస్, కుందూరు రాజేందర్ రెడ్డి, నెర్మటి వెంకట్‌రెడ్డి, నామని సుధాకర్, పాంపాటి శ్రీనివాస్, మజహార్ మొహినోద్దీన్, పాండునాయక్, నకిరేకంటి సైదులు, ఏసురాజు, వర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నాగార్జునసాగర్ : పైలాన్‌కాలనీలో నందికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఈర్ల రామకృష్ణ, ఆదాసు నాగరాణిలు జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జానారెడ్డి తనయుడు జయవీర్‌రెడ్డి,ఆదాసు విక్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న ఉజ్జిని యాదగిరిరావు

చింతపల్లి : దేశంలో బీజేపీ, తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని మునుగోలు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీపీఐ మండల కమిటీ సమావేం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నేనావత్ బాలునాయక్ గెలుపునకు సీపీఐ కార్యకరర్తలు కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జాతీయ స్థాయిలో ఇండియా కూటమిగా ఏకమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఓలె వెంకటయ్య,ఇద్దిరాములు, నర్సింహా, సైదులు, శ్రీశైలం, లక్ష్మయ్య, కృష్ణయ్య, శ్రీరాములు, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు

మిర్యాలగూడ : పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి అనంతరం కార్యకర్తలో ర్యాలీగా వెళ్లి ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి 2023 వరకు రూ.2,750కోట్లతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. నియోజకవర్గంలో పట్టణంతోపాటు తండాలను, గ్రామాలను అన్నిరకాలుగా తాను అభివృద్ధి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ న్ తిరునగరు భార్గవ్, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, ఏఎంసీ చైర్మన్ బైరం బుచ్చయ్య, బీఆర్‌ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్దార్థ, నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, నామిరెడ్డి యాదగిరిరెడ్డి, మండల పార్టీల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తల తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరులో స్వల్ప ఉద్రిక్తత



బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలను నిలువరిస్తున్న పోలీసులు

నిడమనూరు : నాగర్జున సాగర్ అసెంబ్లీకి నామినేషన్ స్వీకరణ సందర్భంగా గురువారం మధ్యాహ్నం ఆర్‌ఓ కార్యాలయం వద్ద స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థులు కుందూరు జైవీర్‌రెడ్డి, జానారెడ్డి నామినేసన్ వేశారు. అదే సమయంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేయడానికి కార్యాలయంలోకి వెళ్లాడు. ఆ సమయంలో కార్యాలయం నుంచి జానారెడ్డి నామినేషన్ వేసి వెళ్లే సమయంలో బీఆర్‌ఎస్‌కార్యకర్తలు నినాదాలు గట్టిగా చేశారు. అది చూసిన కాంగ్రెస్ కార్యకర్తలూ గట్టి నినాదాలు ఇవ్వడం మొదలు పెట్టారు. ఒకరికొకరు నినాదాలతో హోరెత్తించారు. దీంతో ప్రధాన రహదారిపై ట్రాపిక్ జామ్ అయింది. దీంతో డీఎస్పీ, సీఐలు, పోలీసు సిబ్బంది 40నిమిషాలు పాటు తీవ్రంగా కష్టపడి ట్రాఫిక్‌ను సరి చేశారు. కానీ ఇరు పార్టీల కార్యకర్తలు మాత్రం అక్కడే ఉండి నినాదాలు ఇస్తూనే ఉన్నారు. ఈలోగా ఎమ్మెల్యే నోముల భగత్ నామినేసన్ వేసి బయటికి వచ్చి హాలియా వైపు వెళ్లారు. ఆయన వెళ్లిన కొంత సేపటికి కాంగ్రెస్ కార్యకర్తలు సైతం హాలియా మీటింగ్‌కు అనుమతించారు.

పల్లెపల్లెకు మహనీయుల పొలిటికల్ ఫ్రంట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహనీయుల పొలిటికల్ ఫ్రంట్ సభ్యులు

మర్రిగూడ : మునుగోడు ఎన్నికల్లో బహుజనవాదాన్ని వినిపించేందుకు పల్లెపల్లెకు మహనీయుల పొలిటికల్ ఫ్రంట్ పనిచేస్తుందని మహనీయుల పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ మల్ల యాదయ్య, మునుగోడు ఇన్‌చార్జి జిల్లా వెంకటేష్‌మాదిగ అన్నారు. ఈ నెల 14న చండూరులో జరిగే ఓటు మనదే సీటు మనదే కలిసుంటే రాజ్యాధికారం మనదే సమావేశ వాల్‌పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. బహుజనులను ఏకం చేస్తూ ప్రధాన పార్టీలకు దీటుగా గ్రామస్థాయి నుంచి బహుజనవాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగిల్ల మారయ్య, నారపాక అంజి, నెల్లికంటి రాఘవేంద్రయాదవ్, సురేష్, రాములు, నరసింహ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజా న్యాయపీఠాలను ఆశ్రయించడం ఉత్తమం

హుజూర్‌నగర్ : ప్రజా న్యాయపీఠాలను ఆశ్రయించడం ఉత్తమ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించకుని స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సమయం, డబ్బు వృథా కాకుండా న్యాయ స్థానాల ద్వారా తమ సమస్యల పరిష్కారానికి ప్రజా న్యాయ పీఠాలను ఆశ్రయించడం ఉత్తమమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 ప్రకారం పౌరులందరికీ సమ న్యాయం అందించవలసి ఉందని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నట్టే సత్యనారాయణ, రవికుమార్, కె.నర్సింహారావు, ఎం.రాఘవరావు, సైదా హుస్సేన్, వీరయ్య, గోపీనాథ్, వెంకటేష్, పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



తాళి చూపుతున్న వేద పండితులు

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేతా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శ్రీనివాసశాస్త్రి, వేద పండితులు ఇరువంటి శ్రీపాద శర్మ, సంతోష్, విష్ణుమూర్తులు వేద మంత్రాలతో సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, లక్ష పుష్పార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాలవ్వాయి శ్రీనివాస్‌రావు, పాల్వాయి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు రాచకొండ రాంమోహన్‌రావు, వనిత క్లబ్ అధ్యక్షుడు వీరవల్లి శ్రీలత, భాగ్యలక్ష్మి, కందిబండ శ్రీనివాస్‌రావు, సుధాకర్, మాశెట్టి లక్ష్మయ్య, నటరాజ్, వెంకన్న, కిశోర్, కట్ట గణేష్, పులయ్య, భక్తులు తదితరులు ఉన్నారు.